క్లుప్తంగా

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మిర్యాలగూడ : ఈనెల 4న మిర్యాలగూడ మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నూకల సరళ హన్మంతరెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గార్లపాటి జ్యోతిలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో గార్లపాటి జ్యోతిలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులతోపాటు ఆయా శాఖలకు చెందిన అధికారులు తమ ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న ఆలయ ధర్మకర్త కుంభం మనోహర్‌రెడ్డి, భక్తులు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ 12వ వార్షికోత్సవాన్ని ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గోదా సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా జరిపారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు కల్యాణోత్సంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్త కుంభం సునితమనోహర్‌రెడ్డి, కమిటీ సభ్యులు కేసాని లింగారెడ్డి, ఉట్కూరి శ్రీనివాస్‌రెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జూనూతుల గట్టులో హనుమాన్ భక్తుల రద్దీ



గట్టుపై పూజలు చేస్తున్న భక్తులు

గుర్రంపోడు : మండలంలోని జూనూతుల గ్రామంలో గట్టుపై ఆంజనేయస్వామి విగ్రహాలు ఇటీవల బయటపడటంతో భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తుతున్నారు. గ్రామంలోని హనుమాన్ భక్తులకు గుట్టపై హనుమాన్ విగ్రహాలు ఉన్నట్లు కలలో రావడంపై భక్తులకు గుట్టపై విగ్రహాలు దర్శనమిచ్చాయి. దీంతో పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యతో భక్తులు రోజూ గట్టుపైకి చేరుకుని పూజలు చేస్తున్నారు. గట్టుపై అంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మునుగోడు: మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త పసునూరి శంకరయ్య శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన అంత్యక్రియల నిమిత్తం రాజగోపాల్ రెడ్డి పంపిన రూ. 20వేల నగదును కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నాయకులు బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. అంతకు ముందు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు దండు లింగస్వామి, చిలుకరాజు శంకరయ్య. సీపీఐ నాయకుడు మందుల పాండు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



పూజల్లో పాల్గొన్న కంచర్ల భూపాల్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో శనివారం అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. హరిహర భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అయ్యప్ప భజనలు, పాటలు ఆలపించారు. కంచర్ల భూపాల్‌రెడ్డి, కంచర్ల కృష్ణారెడ్డి, రఘుపతి, టిఎస్‌జీఓ నాయకులు పందిరి వెంకటేశ్వర్లు, శ్రవణ్‌కుమార్, అక్కయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


పచ్చల సోమేశ్వరాలయంలో కాంగ్రెస్ నాయకుల పూజలు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని పానగల్లు పచ్చల సోమేశ్వరాలయంలో కాంగ్రెస్ నాయకులు శనివారం పూజలు నిర్వహించారు. ఆలయంలోని శివుడికి అర్చన, రుద్రాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలవాలని, ఉన్నత పదవులు అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో డైరెక్టర్ ఈసం లింగయ్య, రిటైర్డ్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ బుర్రి కృష్ణశేఖర్, జంగయ్య, కొండల లింగయ్య, పల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, జీవన్‌కుమార్, మహేష్‌కుమార్, పాండు, శ్రీనివాస్, సోమయ్య, పాల్గొన్నారు.

గెలుపోటములపై జోరుగా చర్చ

- ఎక్కడ చూసినా ఇదే తీరు
- నేటితో తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

హాలియా : నాగార్జున సాగర్ నియోజకవర్గంలో ఏ నలుగురు గుమిగూడిన గెలుపోటములపైనే శనివారం జోరుగా చర్చ జరుగుతోంది. గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద, పంట పొలాలు, చెట్ల నీడన, రచ్చబండల కాడ, పట్టణాల్లో టీస్టాళ్లు, హోటళ్లు, కార్యాలయాల్లో, దుకాణాల సముదాయాల్లో ఎక్కడ చూసినా ఎన్నికల ఫలితం, మెజార్టీపై దృష్టి. ఓ ప్రధాన పార్టీ గెలవడంతో పాటు ఆ పార్టీకి అత్యధి మెజార్టీ వస్తుందని, లేదు లేదు ఈ పార్టీనే స్వల్ప మెజార్టీతో గెలుస్తుందని చర్చించుకుంటున్నారు. మొదటి నుంచి ఆ పార్టీ ప్రచారం బాగా చేసింది, కానీ డబ్బులు ఇవ్వకపోవడం వల్లనే వెనకబడిందని చర్చించుకుంటున్నారు. పోలింగ్ ముందు రాత్రి ఓ పార్టీ క్వార్టర్ రూ. 800 నుంచి 1000 డబ్బులు ఎక్కువగా ఇచ్చిందని, లేదు లేదు మేము ఆ పార్టీతో సమానంగా డబ్బులు ఇవ్వలేకపోవడంతో పాటు కొందరికి ఇచ్చి మరికొందరికి ఇవ్వకపోవడం వల్లనే వెనుకబడిపోయామని చర్చ ఎక్కువగా జరుగుతోంది. దీంతో పాటు కొంత రాజకీయాల మీద ఆసక్తి ఉన్న వారు.. మీ నియోజకవర్గంలో ఎట్లుంది..ఎవరు గెలుస్తారని ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారి బంధువులకు ఫోన్లు చేసి మరీ తెలుసుకుంటున్నారు. గురువారం సాయంత్రం నుంచే టీవీల్లో ఎగ్జిట్‌పోల్స్ సర్వేలు పార్టీల ఫలితాలు వెల్లడించాయి. వాటి ఆధారంగా కొందరు పార్టీ చేసిన అభివృద్ధి, అభ్యర్థుల వ్యక్తిత్వం, వ్యతిరేకత, పంపిణీ చేసిన నగదు, ఆధారంగా గెలుపోటములను అంచనాలు వేసుకున్నారు.



ఓటేయని ఓటర్ల సంఖ్య 33,177 మంది

సాగర్ నియోజకవర్గంలో ఓటింగ్‌కు 33,177 మంది దూరంగా ఉన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 2,33,412 మంది ఓటర్లు ఉండగా వీరిలో స్త్రీలు 118640 మంది కాగా పురుషులు 114752 మంది, ఇతరులు 20 మంది ఉన్నారు. వీరిలో ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో నియోజకవర్గ వ్యాప్తంగా 200235 మంది కాగా వీరిలో స్త్రీలు 100665 మంది, పురుషులు 99557 మంది ఉన్నారు. మిగిలిన 33,177 మందిలో చనిపోయిన వారు, ఓటుపై నిరాసక్తత, బద్దకం, ఇతర కారణాలతో ఓటింగ్‌కు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది.

జోరుగా బెట్టింగ్‌లు..

నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపోటములు అలా ఉంటే మరో వైపు అభ్యరర్థులపై జోరుగా బెట్టింగ్‌లు కడుతున్నట్లు సమాచారం. నియోజకవర్గంలో ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తలు తమ పార్టీ అభ్యర్థి గెలుస్తాడంటే..తమ పార్టీ అభ్యర్థి గెలుస్తాడని బెట్టింగ్‌లు కడుతున్నారు. సామాన్య ప్రజానీకం కూడా ఫలానా పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తాడంటూ బెట్టింగ్‌లకు దిగుతున్నారు. కొందరైతే మెజార్టీ ఎంత వస్తుందనే దానిపై కూడా బెట్టింగ్‌లు కాస్తున్నారు. గెలుపు కోసం అభ్యర్థి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తే..వారి అనుచరులు, కార్యకర్తలు తాము బెట్టింగ్ కట్టిన డబ్బులు వస్తాయో..పోతాయో అనే ఆందోళనకు గురవుతున్నట్లు తెలిసింది. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ఈ బెట్టింగ్ ప్రక్రియ జోరుగా సాగుతోంది. తమ పార్టీ అభ్యర్థి గెలవడంతో పాటు జిల్లాలో అత్యధిక మెజార్టీ వస్తుందని..కాదు తమ పార్టీ అభ్యర్థి స్వల్ప మెజార్టీతో బయట పడుతాడంటూ.. బెట్టింగ్‌లో పాల్గొంటున్నట్లు వినికిడి.

ఇంటికే పరిమితం..

మొన్నటి వరకు గ్రామాల్లో..పట్టణాల్లో ఎన్నికలు అభ్యర్థుల ప్రచార రథాలు, సభలు, సమావేశాలు, ర్యాలీలు, వీధిల్లో తిరుగుతూ ప్రచారం హోరెత్తించారు. ఎన్నికల ముందు రోజు రాత్రి పంపకాలపై చర్చ జరిగితే.. పోలింగ్ ముగిసింది.. అభ్యర్థులు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. కార్యకర్తలు గల్లీ లీడర్లు ఇప్పుడు గెలుపు ఓటములపై బేరసాలు వేసుకుంటున్నారు. పోలైన ఓట్లు, వచ్చే ఫలితం, మెజార్టీ ఇలా ఉంటాయనే ఆలోచనలో ఎవరికి వారు అంచనా వేసుకుంటున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెద్దవూర: మండలంలోని పెద్దగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్నగూడెం గ్రామానికి చెందిన, పెద్దవూర ఎంపీడీవో కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగి కురాకుల రామలింగయ్య(57) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి చిన్నగూడెంలోని ఆయన నివాసానికి వెళ్లి రామలింగయ్య మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట ఎంపీపీ చెన్ను అనురాధసుందర్‌రెడ్డి, సర్పంచ్ కూన్‌రెడ్డి మల్లారెడ్డి, లింగయ్య, సుంకిరెడ్డి సంజీవరెడ్డి, బెడుదూరి వెంకట్‌రెడ్డి, పవన్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

అనారోగ్యంతో మృతి చెందిన పెద్దవూర ఎంపీడీఓ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న కురాకుల రామలింగయ్య కుటుంబ సభ్యులకు దహన సంస్కారాల నిమిత్తం ప్రభుత్వం అందించిన రూ.20వేలను ఎంపీడీఓ రమేష్ దీన్‌దయాళ్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుంచి పెద్దవూర ఎంపీడీవో కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడని తెలిపారు. గత కొద్ది నెలల నుంచి కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అనుముల ఎంపీడీఓ లక్ష్మి, పెద్దవూర ఎంపీఓ విజయకుమారి, శ్యాంసుందర్, రవి, వెంకట్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



రామలింగయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

నల్లగొండలో గులాబీ జెండా ఎగరడం ఖాయం

నల్లగొండ టూటౌన్: నల్లగొండ గడ్డపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం నల్లగొండ పట్టణంలోని లక్ష్మీ గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. టికెట్లు అమ్ముకొని ఖర్చు పెట్టిన కోమటిరెడ్డిపై తాను 10 వేల మెజార్టీతో గెలుస్తానని తెలిపారు. ఎగ్జిట్ పోల్స్ చూసి కార్యకర్తలు ఎవరూ అధైర్య పడొద్దన్నారు. వెన్నుపోటు నాయకుల వల్ల మెజార్టీ తగ్గుతుందేమోనని, లేదంటే 25 వేల మెజార్టీతో గెలుపొందేవాడినని చెప్పారు. 2018లో సర్వేలన్నీ బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా వచ్చాయని, అయినా అత్యధిక స్థానాలు కైవసం చేసుకున్నామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నాయకుడు చకిలం అనిల్‌కుమార్ మాట్లాడుతూ కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని కాపాడే నాయకుడు భూపాల్‌రెడ్డి అని అన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, పంకజ్‌యాదవ్, నిరంజన్‌వలీ, సత్తయ్యగౌడ్, సైదులుగౌడ్, సుధాకర్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

దేవరకొండలో గెలుపెవరిది?

- గెలుపుపై లెక్కలు వేసుకుంటున్న పార్టీలు
- ఎక్కడ చూసినా ఫలితాలపైనే చర్చ

దేవరకొండ : పరీక్షల అనంతరం ఫలితాల కోసం ఎదురు చూస్తున్నట్లు ఉంది అసెంబ్లీ సాధారణ ఎన్నికలలో పోటీ చేసిన పార్టీల అభ్యర్థుల పరిస్థితి.. ఓటర్లు నాయకుల భవితవ్యాన్ని ఈవీఎంలో నిక్షిప్తం చేయడంతో తమ గెలుపోటములపై ప్రధాన పార్టీల నాయకుల మొదలు.. స్వతంత్ర అభ్యర్థులు సైతం ఓటింగ్ సరళిపై లెక్కలు వేసుకునే పనిలో బిజీగా ఉన్నారు. తమకు అనుకూల వర్గాల నుంచి, వార్డులు, గ్రామాలు, మండలాల వారీగా పోలైన ఓట్ల గురించి లెక్కలు వేసుకుంటున్నారు. నేడు కౌంటిగ్‌తో గెలిచేదెవ్వరో తేలనుంది.

ప్రచారం మొదలుకొని.. ఓటింగ్ వరకు

నల్లగొండ జిల్లాలో దేవరకొండ అసెంబ్లీ స్థానానికి ప్రత్యేక స్థానం ఉంది. జిల్లాలో ఎస్టీ రిజర్వ్‌డ్ ఏకైక స్థానం అయిన దేవరకొండపై పట్టు నిలుపుకునేందుకు బీఆర్‌ఎస్ మరోసారి ప్రయత్నిస్తుండగా కాంగ్రెస్ అధికారమే ధ్యేయంగా ప్రచారం నిర్వహించింది. ఇక స్వతంత్రులు సైతం తామున్నామంటూ బరిలో నిలిచారు. నవంబర్ 3న నామినేషన్ల ప్రక్రియ పూర్తవ్వడంతో ప్రధాన పార్టీలు మొదలు స్వతంత్య్ర అభ్యర్థులు తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు ప్రచారాన్ని హోరెత్తించారు. ఈ క్రమంలో తండాలు, గ్రామాలు, పట్టణాలను చుట్టేస్తూ ప్రచారం చేపట్టారు. బిఆర్‌ఎస్ తమ అభివృద్ధిని వివరిస్తూ ప్రచారంలో ముందుకు సాగగా, కాంగ్రెస్...అధికార పార్టీ వైఫల్యాలను ఎత్తి చూపుతూనే ఆరు గ్యారంటీ పథకాలను ఓటర్లలోకి తీసుకెళ్లే ప్రయత్నం చేసింది. దీనికి తోడు ప్రచార పర్వం ముగిసిన తర్వాత ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డాయి ప్రధాన పార్టీలు.. వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన వారిని రప్పించేందుకు తమవంతుగా కృషి చేశాయి. ఏదేమైనా ప్రధాన పార్టీల ప్రయత్నాలు ఫలించినట్లే కనిపిస్తుంది. ఉదయం మందకొడిగా సాగిన పోలింగ్ సరళి మధ్యాహ్నానికి వేగం పుంజుకుంది. దీంతో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 7.30వరకు సైతం పోలింగ్ సాగింది.



పెద్దఅడిశర్లపల్లి : మునావత్ తండాలో బారులుదీరిన ఓటర్లు (ఫైల్)

గెలుపుపై ఎవరి ధీమా వారిదే

దేవరకొండ అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి నవంబర్ 30న పోలింగ్ జరిగింది. అయితే నియోజకవర్గ వ్యాప్తంగా 2,51,266 మంది ఓటర్లు ఉండగా 2,12,593మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పోలింగ్ ప్రక్రియ ముగియడంతో ఆయా ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు తమకు పోలైన ఓట్లను లెక్కలు వేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. కులాల వారీగా, ప్రాంతాల వారిగా, పట్టున్న ప్రాంతాలు, పట్టణాల్లో పోలైన ఓట్లు, తండాలు, గ్రామాలు, వార్డుల వారీగా పోలైన ఓటింగ్ సరళిని పరిశీలిస్తూ గెలుపుపై లెక్కలు వేసుకుంటున్నారు. కాగా ఈనెల 3న జరగనున్న కౌంటింగ్‌తో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. సుమారు నెల రోజుల పాటు రాజకీయ నాయకుల హడావుడి, ప్రచారాలు, సందడిగా సాగిన అసెంబ్లీ ఎన్నికలు చివరి అంకానికి చేరాయి.

19 రౌండ్లలో మిర్యాలగూడ ఓట్ల లెక్కింపు

- ఒక్కో రౌండ్‌లో 14 టెబుళ్ల ద్వారా లెక్కింపు

మిర్యాలగూడ : మిర్యాలగూడ నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఆదివారం నల్లగొండలో ఉదయం 8గంటల నుంచి ప్రారంభం కానుంది. 19రౌండ్లలో రౌండ్‌కు 14 పోలింగ్ బూత్‌ల చొప్పున కౌంటింగ్ ప్రక్రియ కొనసాగనుంది. మొదటి రౌండ్‌లో.. పాముల పాడు బూత్ నంబర్లు – 1, 2, 3, పోరెడ్డిగూడెం పీఎస్ 4, చిరుమర్తి 5,6, గుర్రప్పగూడెం 7, భీమనపల్లి 8, ఆగామోత్కూర్ 9, 10, బొమ్మనకల్ 11, పుచ్చకాయలగూడెం 12, తోపుచర్ల 13,14 లెక్కించనున్నారు. రెండో రౌండ్‌లో.. ఇసుకబావిగూడెం బూత్ నంబర 15, సల్కునూరు 16, 17, మంగాపురం 18, కల్వలపాలెం 19, ఎరుకలగుట్ట 20, ఆమనగల్లు 21,22, లక్ష్మీదేవిగూడెం 23, రావులపెంట 24, 25, 26, కామేపల్లి 27, మొల్కపట్నం 28 బూత్ ఈవీఎంలను లెక్కించనున్నారు. మూడో రౌండ్‌లో.. మొల్కంపట్నం 29, శెట్టిపాలెం 30, 31, 32, 33, తిమ్మారెడ్డిగూడెం 34, వేములపల్లి 35, 36, 37, 38, 39, కుక్కడం 40, 41, 42 బూత్ ఈవీఎంలను లెక్కించనున్నారు. నాలుగో రౌండ్‌లో.. గంధ్రవానిగూడెం 43, బుగ్గబావిగూడెం 44, అన్నపరెడ్డిగూడెం 45, మిర్యాలగూ టౌన్ విద్యానగర్ 46, 47, 48, 49, 50, హౌసింగ్‌బోర్డు 51, 52, గాంధీనగర్ 53, 54, 55, కలాల్‌వాడ 56 బూత్‌లవి లెక్కించనున్నారు. ఐదో రౌండ్‌లో..మిర్యాలగూడ టౌన్ కలాల్‌వాడ 57, సుందర్‌నగర్ 58, 59, 60, రైతువేదిక మిర్యాలగూడ 61, తాళ్లగడ్డ 62, షాబునగర్ 63, 64, తాళ్లగడ్డ 65, 66, రాంనగర్ 67, 68, 69, షాబునగర్ 70 బూత్‌లవి లెక్కించనున్నారు. ఆరో రౌండ్‌లో.. మిర్యాలగూడ టౌన్ నందిపాడు 71, 72, సీతారాంపురం 73, 74, 75, బీసీ హాస్టల్ 76, 77, 78, సీతారాంపురం 79, 80, శాంతినగర్ 81, ఎస్‌ఎస్పీ క్యాంపు 82, 83, శాంతినగర్ 84 బూత్‌లవి లెక్కించనున్నారు. ఏడో రౌండ్‌లో.. మిర్యాలగూడ టౌన్ శాంతినగర్ కమ్యూనిటిహాల్ 85, బకల్‌వాడ 86,



నల్లగొండలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాల్

సంతోష్‌నగర్ 87, బకల్‌వాడ 88, 89, 90, కృష్ణ కాలనీ 91, అశోక్‌నగర్ 92, 93, 94, హనుమాన్‌పేట 95, 96, నాగార్జునసాగర్ 97, 98 బూత్‌లవి లెక్కించనున్నారు. ఎనిమిదో రౌండ్‌లో.. మిర్యాలగూడ టౌన్ నాగార్జునసాగర్ 99, రెడ్డికాలని 100, 101, 102, 103, చర్చిరోడ్డు 104, వడ్డెరగూడెం 105, 106, 107, ఇందిరమ్మకాలనీ 108, 109, ఇస్లాంపురం 110, 111, 112 బూత్‌లలో లెక్కించనున్నారు. తొమ్మిదో రౌండ్‌లో.. మిర్యాలగూడ టౌన్ చైతన్యనగర్ 113, 114, బంగారుగడ్డ 115, మినా కళాశాల 116, బంగారు గడ్డ 117, 118, 119, 120, 121, మినా కళాశాల 122, ఏడుకోట్ల తండా 123, ఈదులగూడెం 124, 125, 126 లెక్కించనున్నారు. పదో రౌండ్‌లో ఈదులగూడెం 127, ప్రకాశ్‌గర్ 128, 129, 130, 131, గోగువారి గూడెం 132, నందిపాడు 133, 134, రవీంద్రనగర్ కాలనీ 135, గోపసముద్రం తండా 136, వాటర్ ట్యాంక్ తండా 137, ఐలాపురం 138, కుంటకింది తండా 139, చిల్లాపురం 140 లెక్కించనున్నారు. 11వ రౌండ్‌లో.. శ్రీనివాస్‌నగర్ 141, 142, తుండపాడు 143, 144, సామేగాని తండా 145, లావూడి తండా 146, తుంగపాడు 147, వెంకటాద్రిపాలెం, 148, జంకుతండా 149, వెంకటాద్రిపాలెం 150, జంకుతండా 151, వెంకటాద్రిపాఎలం 152, జప్తి వీరప్పగూడెం 153, భల్లునాయక్‌తండా 154 బూత్‌లవి లెక్కించనున్నారు. 12 రౌండ్‌లో.. సీత్యాతండా 155, అన్నారం 156, 157, చింతపల్లి 158, 159, 160, 161, యాద్గార్‌పల్లి 162, 163, 164, కాల్వలపల్లి 165, 166, ఉట్లపల్లి 167, 168 వి లెక్కించనున్నారు. 13 రౌండ్‌లో.. ఉట్లపల్లి 169, నర్సింహులుగూడెం 170, తక్కెళ్లపాడుతండా 171, తక్కెళ్లపాడు 172, 173, దొండవారిగూడెం 174, 175, తడకమళ్ల 176, 177, 178, బాదలాపురం 179, అవంతీపురం 180, 181, ఆలగడప 182 బూత్‌లవి లెక్కించనున్నారు. 14వ రౌండ్‌లో.. సుబ్బారెడ్డిగూడెం 183, 184, 185, రాయినిపాలెం 186, 187, జాలుబాయి తండా 188, ముల్కలకాల్వ 189, గూడూరు 190, 191, బోట్యానాయక్ తండా 192, కిష్టాపురం 193, రుద్రారం 194, కొత్తపేట 195, లక్ష్మీపురం 196వి లెక్కించనున్నారు. 15 రౌండ్‌లో.. కొత్తగూడెం 197, 198, హట్యాతండా 199, కేశవాపురం 200, నూనావత్ తండా 201, మాన్‌తండా 202, జైత్రాంతండా 203, తెట్టెకుంట 204, కొండ్రపోల్ 205, బానావత్ తండా 206, కొండ్రపోల్ 207, రాళ్లవాగుతండా 208, పార్డునాయక్‌తండా 209, బాలాజీనగర్‌తండా 210 బూత్‌లను లెక్కించనున్నారు. 16వ రౌండ్‌లో.. గాంధీనగర్ 211, దిలావర్‌పూర్ 212, 213, కేజేఆర్ కాలనీ 214, దూద్యాతండా 215, బొత్తలపాలెం 216, 217, కల్లెపల్లి 218, 219, తిమ్మాపురం 220, పుట్టలగడ్డ 221, నర్సాపూర్ 222, 223, దామరచర్ల 224 బూత్‌లవి లెక్కించనున్నారు. 17వ రౌండ్‌లో .. దామరచర్ల పీఎస్ 225, 226, రాజగట్టు 227, దామరచర్ల 228, 229, 230, వాచ్యాతండా 231, బొత్తలపాలెం 232, గణేశ్‌పాడు 233, వాడపల్లి 234, 235, 237, 238 బూత్‌లవి లెక్కించనున్నారు. 18వ రౌండ్‌లో.. ఇర్కిగూడెం 239, 240, తాళ్లవీరప్పగూడెం 241, 242, వీర్లపాలెం 243, 244, 245, శాంతినగర్ 246, ఉల్సాయిపాలెం 247, 248, అడవిదేవులపల్లి 249, 250, 251, 252 బూత్‌లవి లెక్కించనున్నారు. 19వ రౌండ్‌లో.. మూడిమాణిక్యం 253, జిలకరకుండ తండా 254, చాంప్లాతండా 245, కొత్తనందికొండ 256, మొల్కచర్ల 257, బంగారు కుంట తండా 258, బాల్నెపల్లి 259, 260, చిట్యాల 261, సారెగూడెం 262, నడిగడ్డ 263 బూత్‌లను లెక్కించనున్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



విద్యార్థుల ప్రయోగాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ లోకేష్

మునగాల : ప్రస్తుత సమాజంలో అన్ని రంగాల అభివృద్ధికి సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని, అందుకోసం పాఠశాల తరగతి గదే ఒక ప్రయోగశాల కావాలని, ప్రతి విద్యార్థి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మునగాల ఎస్‌ఐ పి.లోకేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సాయి గాయత్రి విద్యాలయంలో విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ఫ్రేయర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన ప్రయోగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎండి.సలీమ్ షరీఫ్, ప్రిన్సిపాల్ అర్వపల్లి శంకర్, మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో 'సన్నాఫ్ సీనియర్లు'

- ఆకట్టుకున్న యువ నాయకుల ప్రచారం
- ఫలితంపై సర్వత్రా ఆసక్తి

నిడమనూరు : నాగార్జునసాగర్ నియోజకర్గంలోని కాంగ్రెస్ సీనియర్ నాయకుల కుమారులు కొత్తగా రాజకీయాల్లోకి వస్తున్నారు. వీరు కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు జయవీర్‌రెడ్డికి ప్రచారంలో అగ్రభాగాన నిలిచారు. సీనియర్ నాయకుడు యడవెల్లి రంగాయిరెడ్డి కుమారుడు యడవెల్లి వల్లభ్‌రెడ్డి, నిడమనూరుకు చెందిన మేరెడ్డి వెంకట్రాహుల్ కుమారుడు మేరెడ్డి వివేక్‌కృష్ణ, నిడమనూరు సర్పంచ్ మేరెడ్డి పుష్పలత కుమారుడు శ్రీనివాసరెడ్డి కుమారుడు మేరెడ్డి వెంకట్, కుందూరు లక్ష్మారెడ్డి కుమారుడు దేవేందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు మాజీ ఎంపీపీ చేకూర హన్మంతరావు కుమారుడు చేకూరి శశిచరణ్ కాంగ్రెస్‌లో చేరి జయవీర్ తరఫున విస్తృత ప్రచారం ఇర్వహించారు. నిడమనూరుకు చెందిన మేరెడ్డి వెంకట్ అమెరికా నుంచి, కుందూరు దేవేందర్‌రెడ్డి కెనడా నుంచి వచ్చి మరీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అనుముల మండలం ఇబ్రహీంపేటకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత యడవెల్లి నరేందర్‌రెడ్డి కుమారుడు వంశీకృష్ణారెడ్డి సైతం జయవీర్‌రెడ్డి గెలుపు కోసం పనిచేశారు. మేరెడ్డి వెంకట్రాహుల్ కుమారుడు మేరెడ్డి వివేక్‌కృష్ణ ప్రచారంలో ఎంతో కలివిడిగా ప్రజలతో మమేకమయ్యాడు. కొన్ని గ్రామాల్లో ఓటర్లు కుందూరు జానారెడ్డి కుమారుడు ఎవరు, ఏడీ అని అడిగిన వారికి వారిని వాహనం వద్దకు తీసుకెళ్లి ఇతనే కుందూరు జయవీర్‌రెడ్డి అని చెప్పి పరిచయం చేశాడు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అంకతి సత్యం కూడా దివంగత సీనియర్ నేత అంకతి వెంకటయ్య కుమారుడే, మండల యూత్ అధ్యక్షుడు నర్సింగ్ విజయ్ కుమార్‌గౌడ్ కూడా సీనియర్ నాయకుడు నర్సింగ్ కృష్ణయ్య కుమారుడే కావడం గమనార్హం. యువ రక్తంతో కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో ఆకట్టుకున్నారు. ఆదివారం వెలువడే ఫలితాలపై వీరి ప్రభావం ఎంత ఉంటుందో వేచి చూడాల్సిందే.



జైవీర్‌రెడ్డి ప్రచారంలో పాల్గొన్న వల్లభరెడ్డి, మేరెడ్డి వెంకట్, దేవేందర్ రెడ్డిలు (ఫైల్)

ప్రమాదం అంచున ప్రయాణం

- వరద కాల్వకు రక్షణ గోడ, హెచ్చరిక బోర్డులు కరువు
- ఆదమరిస్తే నేరుగా కాల్వలోకే..
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- సమస్య పరిష్కరించాలని వేడుకోలు

పెద్దవూర : మండలంలోని తుంగతుర్తి గ్రామ సమీపంలో ఏఎమ్మార్పీ లోలెవల్ వరద కాల్వకు రక్షణ గోడ ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఈ ప్రదేశంలో వాహనదారులు ఏ కొద్దిపాటి అలసత్వం ప్రదర్శించినా, ఆదమరిచినా ఇక అంతే సంగతులు. నేరుగా వెళ్లి కాల్వలో పడాల్సిందే. నాగార్జునసాగర్–హైదరాబాద్ ప్రధాన రహదారిపై గల తుంగతుర్తి స్టేజీ నుంచి గ్రామానికి వెళ్లే రహదారిని బీటీ రోడ్డుగా మార్చారు. మండల కేంద్రం నుంచి గ్రామానికి వెళ్లటానికి ఈ రహదారే దగ్గర ఉంటుంది. దీనికితోడు చింతపల్లితండా, రామన్నగూడెం గ్రామస్తులు సైతం ఇదే దారి నుంచి వెళ్తుంటారు. గ్రామ సమీపంలో ఉన్న వరద కాలువపై నిర్మించిన వంతెన సమీపంలో నుంచి ఈ రహదారి వెళ్తుంది. ఇక్కడ ఎల్ ఆకారంలో మూలమలుపు ఉంది. దీనికి తోడు రహదారి బీటీబు అంచు దాక కాల్వ లైనింగ్ కోతకు గురై మట్టి తేలింది. ఈ రహదారిపై కొత్త వాళ్లు డ్రైవింగ్ చేస్తే వాహనం వేగంగా ఉంటే ప్రమాదం చోటు చేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వాహనదారులు ఇక్కడ ఏమాత్రం ఎమరుపాటు ప్రదర్శించినా వాహనం అతివేగంగా వచ్చి అదుపు తప్పినా నేరుగా కాల్వలో పడిపోవాల్సిందే. కనీసం ఇక్కడ ఎలాంటి రక్షణ గోడను గానీ, ప్రమాద హెచ్చరిక బోర్డులు గానీ ఏర్పాటు చేయలేదు. ఈ రహదారిపై నిత్యం ఆటోలు, పాఠశాల బస్సులు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు అధిక సంఖ్యలో వెళ్తుంటాయి. అధికారులు సత్వరమే స్పందించి మూలమలుపు వద్ద రక్షణ గోడను ఏర్పాటు చేయాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.



రక్షణ గోడ లేకుండా ప్రమాదకరంగా ఉన్న కాల్వ

దగ్గరికి వచ్చేదాకా కనిపించదు



పెద్దవూర నుంచి గ్రామానికి వచ్చే దారిలో ఏఎమ్మార్పీ లోలెవల్ వరద కాల్వ దగ్గరికి వచ్చే దాకా కనిపించదు. వాహనం వేగంగా ఉన్నా, అదుపు తప్పినా, ఏమాత్రం ఎమరుపాటు ప్రదర్శించినా నేరుగా కాల్వలో వాహనంతో పాటు పడిపోవాల్సిందే. దీనికితోడు కాలువ అంచుల వెంట కంపచెట్లు పెరిగి ఈ ప్రదేశంలో కాలువ ఉన్నట్లు కూడా తెలియని పరిస్థితి ఉంటుంది. కొత్తవారు డ్రైవింగ్ చేస్తే కొంత ప్రమాదకరమే. గ్రామానికి ఆటోలు, స్కూల్ బస్సులు, కార్లు సైతం వస్తుంటాయి.

– ఇరుమాది శ్రీనివాస్‌రెడ్డి, తుంగతుర్తి

రక్షణ గోడ ఏర్పాటు చేయాలి



గ్రామ సమీపంలోని ఏఎమ్మార్పీ లోలెవల్ వరద కాల్వ వద్ద ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంటుంది. మండల కేంద్రం నుంచి తుంగతుర్తి గ్రామస్తులతో పాటు చింతపల్లితండా, రామన్నగూడెం తదితర గ్రామాల వాహనదారులు ఇదే దారి గుండా వెళ్తుంటారు. గ్రామ సమీపంలో ఉన్న వరద కాలువ వద్ద ప్రమాదకరమైన ఎల్ ఆకారపు మూలమలుపు ఉండి, రోడ్డు బీటీ అంచులదాక కుంగిపోయి ఉంది. ఈ ప్రదేశంలో రక్షణ గోడలు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలి.

– విష్ణుప్రియా సైదులు, సర్పంచ్, తుంగతుర్తి

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల గడువు పెంపు

త్రిపురారం : తెలంగాణ ఓపెన్ స్కూల్‌లో పదవ తరగతి, ఇంటర్మీడియెట్‌లో అడ్మిషన్లు పొందేందుకు ప్రభుత్వం స్పెషల్ అడ్మిషన్ పేరుతో ఈ నెల 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు చెన్నాయిపాలెం జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ ఉమ్మడి సైదిరెడ్డి, సహాయ కోఆర్డినేటర్ మాలోతు దశరథ నాయక్‌లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. చదువును మధ్యలో ఆపేసిన వారు, ఆర్థిక ఇబ్బందులతో రెగ్యులర్‌గా చదువును కొనసాగించలేనివారు ఓపెన్ టెన్త్ తీసుకోవడానికి అవకాశం ఉందని, పదో తరగతి పాస్ అయిన వారు ఇంటర్మీడియెట్‌లో అడ్మిషన్ పొందేందుకు అవకాశం ఉందన్నారు. 10వ తరగతి అడ్మిషన్ కోసం రికార్డు షీట్, ఆధార్ కార్డు, పాస్ ఫొటో, కులధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌ఫొటోలు, ఇంటర్ అడ్మిషన్ కోసం పదో తరగతి పాస్ మెమో, టీసీ, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్ ఫొటోలతో రావాలన్నారు. ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్ పొందాలనుకుంటే చెన్నాయిపాలెం ఉన్నత పాఠశాలలో సంప్రదించాలని కోరారు. పూర్తి వివరాలకు 9849573645, 8555917912 నంబర్లను సంప్రదించాలన్నారు.

డిండి : ఓపెన్ స్కూల్ పదో తరగతిలో ప్రవేశానికి ఈనెల 11వ తేదీ వరక దరఖాస్తు చేసుకోవాలని చెర్కుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కో ఆర్డినేటర్ ఆడపాల రాంరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు కులం, టీసీ ఆధార్‌కార్డు జీరాక్స్‌తో పాటు మూడ పాస్‌ఫొటోలు తీసుకుని చెర్కుపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు రావాలని కోరారు. మిగతా వివరాలకు 9505593590, 9440960397 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

కౌంటింగ్‌పై ఉత్కంఠ !

మిర్యాలగూడ టౌన్ : ఈనెల 3వ తేదిన ఓట్ల లెక్కింపులో భాగంగా తొలి కౌంటింగ్ మిర్యాలగూడ నియోజకవర్గానిదే కావడంతో ఉత్కంఠ నెలకొంది. దీంతో ప్రధాన పార్టీలు అయినా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల కార్యకర్తల్లో టెన్షన్ ప్రారంభం అయింది. ఎక్కడ చూసినా కూడా బీఆర్‌ఎస్ గెలుస్తుందని ఆ పార్టీ కార్యకర్తలు. కాదు కాంగ్రెస్ పార్టీనే గెలుస్తుందని ఈ పార్టీ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. అదే విధంగా మేధావులు, ఉద్యోగులు, యువకులు మాత్రం ఏ టీ స్టాల్ వద్ద ఉన్న గెలుపు ఓటములపైనే ప్రధాన చర్చ సాగుతుంది. కాగా అభ్యర్థులకు ప్రధాన శ్రేణి నాయకులు ఇచ్చిన రిపోర్ట్ ఒకటి అయితే ద్విశ్రేణి నాయకులు ఇచ్చిన రిపోర్ట్ ఒకటిగా ఉండటంతో అభ్యర్థుల్లో అందోళన నెలకొంది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు నువ్వా, నేనా అనే విధంగా ఉండగా ఆ పార్టీ నుంచి ఈ పార్టీలోకి.. ఈ పార్టీ నుంచి ఆ పార్టీలోకి వచ్చిన కార్యకర్తలతోనే ఆందోళన నెలకొంది.